క్లుప్తంగా

మాజీ మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



కార్వేటినగరం: మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రాస్ వృద్ధాశ్రమంలో వైఎస్ఆర్ సీపీ ఎంపీపీ లతాబాలాజీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, గోపి, రత్నంరెడ్డి, నాగేంద్ర, గోవిందరాజులు, పవన్, సాయి, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి



104 వాహనానికి ఆయుధపూజ

పాలసముద్రం: మండల పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు మోహన్ క్రిష్ణ, లోకేష్ తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణంలో 104 వాహన డీఈఓ శరవణన్, పైలట్ రమేష్ ఆరోగ్య సిబ్బంది కలసి 104 వాహనాన్ని మంచి నీటితో శుభ్రం చేసి, పూలతో అలంకరించి, తెల్లగుమ్మడి కాయ కొట్టి ఆయుధ పూజ వేశారు. కార్యక్రమంలో 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ల మరమ్మతు పనులు



విజయపురం: మండలంలోని పాతర్కాడులో మరమ్మతుకు గురైన పైపులైన్‌ని శుక్రవారం అధికారులు సరి చేశారు. పాతర్కాడు గ్రామానికి తాగునీరు అందించే పైపులైన్ మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి మరమ్మతు చేసి తాగునీరు అందించారు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్

వెదురుకుప్పం: అంటు వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రగుంటపల్లె గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల ద్వారా చికున్ గున్యా, డెంగీ, మలేరియా, పైలేరియా తదితర వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాసాల వద్ద వృథా నీటిని నిల్వ ఉంచుకోకూడదన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు, పర్యవేక్షకుడు మోహన్‌మురళీ నాథ్, ఏఎన్ఎం సుధ, ఆశ వర్కర్లు సుమతి, పుష్ప పాల్గొన్నారు.

ఘనంగా తపాలా వారోత్సవాలు



నగరిలో తపాలా వారోత్సవాలు

నగరి: పోస్టాఫీస్‌లో శుక్రవారం తపాలా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి పోస్టల్ ఎస్పీ వసంత తిరుపతి ముఖ్యఅతిథిగా వచ్చారు పోస్టాఫీస్‌లోని పథకాలను క్లుప్తంగా వివరించారు. తడుకుపేట పోస్టాఫీస్‌లో ఆర్‌పీఎల్ఐ ఇన్సూరెన్స్ చేసిన మృతుడి భార్య జ్యోతికి చెక్కు రూపంలో నగదు అందించారు. తపాలా వారోత్సవాలు కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పుత్తూరు సతీష్, నగరి ఎస్పీఎం కవిత, ప్రజా ప్రతినిధులు చిరంజీవి, దయాళన్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



నగరిలో అన్న క్యాంటీన్

నగరి: పట్టణంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ శుక్రవారం అన్న క్యాంటీన్‌ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు మున్సిపాల్ కమిషనర్ కృష్ణారెడి, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తున్నా.. అధికారులు రారు!

'పొలం పిలుస్తోంది' కార్యక్రమంపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రచారం ఎక్కువ పని తక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు మినహా, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజవుతుండడంతో కార్యక్రమం అభాసుపాలవుతోంది.

– విజయపురం

- మొక్కుబడిగా పొలం పిలుస్తోంది కార్యక్రమం



నగరిలో వరి పొలం

పొలం పిలుస్తోంది ఉద్దేశం

పంటల సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ఉదయం 8.30 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు అనుబంధ శాఖల అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్ (పొలంబాట) చేపట్టాల్సి ఉంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు, సాయంత్రం 3 నుంచి వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన 14 శాఖల అధికారులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించాలి. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతోపాటు సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన పద్ధతులపై అవగాహన కల్పించాలి. అంతే కాకుండా అధికారులు రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలనతో పాటు లోపాలు గుర్తించాలి. ఈ వివరాలు రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలిస్తారు. పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసుకోవడం, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం పథకం దిశగా ప్రోత్సహించడం చేపట్టాల్సి ఉంది. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలి.

అధికారులు దూరం

పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవసాయశాఖ అధికారులతో పాటు ఆత్మ, ఏపీ సీఎస్ఎఫ్, ఉద్యానశాఖ, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఏపీ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్, కోఆపరేటివ్ ఫెడరేషన్, మత్స్యశాఖ, వ్యవసాయ మార్కెటింగ్‌తో పాటు కెనాల్స్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం ఇలా పదికి పైగా శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. కానీ వ్యవసాయశాఖతో పాటు ఉద్యానశాఖ అప్పుడప్పుడూ పశుసంవర్ధకశాఖ తప్ప మిగిలిన వారు ఎవ్వరూ పాల్గొనడం లేదు. దీంతో ఈ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులే నిర్వహించి ఫ్లెక్సీలతో నాలుగు ఫొటోలు దిగి మమ అనిపించేస్తున్నారు.

మొక్కుబడిగా....

పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడానికి ముందు రోజు పంచాయతీల్లో దండోరా వేయించాలి. ఎక్కడగానీ దండోరా వేసినట్లు దాఖలాలు కనిపించలేదు. దీంతో చాలా మంది రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రాలేకపోతున్నారు. వచ్చిన 10 మందితో కార్యక్రమాన్ని మొక్కుబడిగా ముగిస్తున్నారని రైతులు అంటున్నారు.



విజయపురం పొలం పిలుస్తోంది కార్యక్రమం(ఫైల్)

అవగాహన లేమి

నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నిండ్ర, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో 25వేల మందికి పైగా రైతులు ఉన్నారు. వారు ఇప్పటికే వివిధ రకాల పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా వరి ఎక్కువగా సాగు చేస్తుంటారు. కొన్ని చోట్ల నాట్లు వేయగా, మరి కొన్ని చోట్ల పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో 2000 హెక్టార్లలో వరి సాగులోకి రానుంది. ఈ ఐదు మండలాల్లో 3000 హెక్టార్లకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. వేరుశనగ, నువ్వులు, సన్‌ఫ్లవర్, ఉద్దులతో పటు వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. వీరికి సరైన అవగాహన లేకపోవడంతో రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారు.

అధికారులు వస్తున్నారు

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి కచ్చితంగా అన్ని అనుబంధ శాఖలవారు హాజరు కావాలి. కొన్ని శాఖలకు చెందిన అధికారులు వస్తున్నారు. అన్ని మండలంలో జరుగుతున్నాయి కాబట్టి అప్పుడప్పుడు మన మండలానికి కూడా వస్తున్నారు. రైతులకు అన్ని విధాలుగా అవగాహన కల్పిస్తున్నాం.

– రజనికుమారి, ఏఓ, విజయపురం

మహిషాసుర మర్దిని అలంకరణలో దేశమ్మ, ప్రత్యేక అలంకరణలో ఒన్నూరమ్మ, కాళరాత్రి అలంకరణలో అన్నపూర్ణేశ్వరి దేవి ఊరేగింపు, సరస్వతి అలంకరణలో కామాక్షీ దేవి, దుర్గాదేవి











మహిషాసురమర్దిని... శైలసుతే...

నగరి: నియోజకవర్గంలో శుక్రవారం ఆయుధపూజ, సరస్వతి పూజ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అమ్మవార్లకు చేసిన అలంకరణలు భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయాలకు విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. బుగ్గ అగ్రహారం ఒన్నూరమ్మ దేవాలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. టీఆర్ కండ్రిగలోని నేత్రప్రదాయిని దేశమ్మ దేవత మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారికి అర్ధనారీశ్వర అలంకరణ చేశారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవికి సిద్ధిదేవి అలంకారం చేశారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయం వద్ద పేదలకు చీరలు పంపిణీ చేశారు.

వైభవంగా దుర్గాదేవి పూజలు

విజయపురం: మండలంలోని జగన్నాథపురం శ్రీరామ నామ క్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవం పురస్కరించుకుని శుక్రవారం దుర్గాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి అభిషేకించారు. ఆలయాన్ని మామిడి ఆకుల తోరణం, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదం అందించారు.

మహిషాసురమర్దినిగా శ్రీబంగారమ్మ

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ బంగారమ్మ మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. అనంతరం ఉభయదారులైన ధనశేఖర్ మొదలియార్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సుగంధభరిత పుష్పమాలికలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, భక్తులు పాల్గొన్నారు.





మహిళలకు చీరల పంపిణీ, గిరిజా కన్యకా పరమేశ్వరి అమ్మవారు

బాట గంగమ్మకు ప్రత్యేక పూజలు

పచ్చికాపల్లం రోడ్డులో వెలసి ఉన్న బాటగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలత్తూరు సమీపంలోని శ్రీముత్యాలమ్మ ఆలయంలో కూడా శుక్రవారం మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఈఓ తిమ్మారెడ్డి, తహశీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఆలయ చైర్మన్ లింగారెడ్డి, జయశంకర్‌నాయుడు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని నరసింహపురం పంచాయతీ మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడివేటమ్మ తల్లిని నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి ఊరేగించారు. చెవిటి గంగమ్మతల్లికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారిని పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనంతో వివిధ అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం భక్తులు అధిక సంఖ్యతో పాల్గొని అమ్మవార్లను పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, నూతన వస్త్రాలు అలంకరించి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మాంగల్య భాగ్యం, పుత్రసంతానం కలగని మహిళలు ఆలయ ప్రాంగణంలో పిండి దీపాలు వెలిగించారు. సాయంత్రం నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిజ కన్యకా పరమేశ్వరిని మహిషాసురమర్దినిగా అలంకరించి, దీపారాధన చేపట్టారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయం ఆవరణలోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం మహిషాసురమర్దినిగా అలంకరించారు. అంతకు ముందు ఆలయంలో భక్తిప్రపత్తులతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు పట్టు పీతాంబరాలు వెండి తొడుగులతో కూడిన ఆభరణాలతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. చవటగుంటలో ఉన్న మీనాక్షి సమేత ఆవుదేవ నందీశ్వర స్వామి ఆలయంలో మీనాక్షి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులను కటాక్షించారు.

శాకాంబరిగా అల్లిఎల్లమ్మ తల్లి

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీఅల్లిఎల్లమ్మ తల్లి దేవస్థానంలో దసరా మహోత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు ఆనందస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. లేట్ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు సోనియా ప్రకాష్ ఉభయ దారులుగా వ్యవహరించారు. ఉత్సవమూర్తిని శాకాంబరి దేవిగా అలంకరించి పల్లకిపై ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు పార్థసారధి రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు గుణశేఖర్‌రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.











మహిషాసురమర్దినిగా శ్రీబంగారమ్మ, శ్రీముత్యాలమ్మ, మహిషాసురమర్దినిగా పడివేటమ్మ, వెదురుకుప్పం: మహిషాసురమర్దినిగా రాజరాజేశ్వరి, శాకాంబరిదేవిగా అల్లిఎల్లమ్మ

అధిక లోడ్ ప్రమాదకరం



పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వారికి నమస్కరిస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

కార్వేటినగరం: పరిమితికి మించిన లోడ్‌తో ప్రయాణించడం ప్రాణాలకు ముప్పుతెస్తుందని ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తమిళనాడు సరిహద్దు ప్రాంతం కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనానికి ఇన్సూరెన్సు తోపాటు ఇత రికార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కొల్లాగుంట వద్ద నాకాబందీలో భాగంగా చిత్తూరు వైపు వెళ్లుతున్న టాటా ఏస్ వాహనంలో పరిమితికి మించి ప్రయాణిస్తుండగా నమస్కరించి మరీ హితవు పలికారు. ఇలాంటి సంఘటనలు మరో సారి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్రైవర్‌ను ఆదేశించారు. పోలీసు సిబ్బంది రాజశేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీలక్ష్మీనారాయణుని రథోత్సవం

గంగాధరనెల్లూరు: వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రథాన్ని ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ కె.ఎస్.వాసు, అమృతవల్లి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నారాయణుడిని అశ్వ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం గుడిలో మధ్యాహ్నం, రాత్రి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి భక్తులు తరలివచ్చారు. సుమిత్ర, శ్రీధర్, వెంకటేష్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అన్నదాన కార్యక్రమం

గంగాధరనెల్లూరు: పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంవీ శ్రీధర్‌రెడ్డి ఆర్థిక సాయంతో రోగులకు శుక్రవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సహాయ సహకారాలు అందించిన డాక్టర్ దుర్గాదేవి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి మండల రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


కామాక్షమ్మకు గాజుల అలంకారం



మొగిలిలో గాజుల అలంకరణ

బంగారుపాళెం: దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని మొగిలి శివాలయంలో శ్రీకామాక్షమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కామాక్షమ్మవారిని గాజులతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజులు, అర్చకులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా పాలేటమ్మ



దుర్గాదేవిగా పాలేటమ్మ

ఐరాల: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పాలేటమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌ను సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పాలేటమ్మను దుర్గాదేవిగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన చేశారు. వైఎస్ గేటులోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. భక్తులకు పసుపు, కుంకుమ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా వైఎస్ గేటు గ్రామస్తులు వ్యవహరించారు.

18 మద్యం షాపులకు 230 దరఖాస్తులు

- దరఖాస్తుల ఫీజు ద్వారా రూ.4.60 కోట్ల ఆదాయం
- 14న తిరుపతిలో లాటరీ ద్వారా కేటాయింపులు
- ఎక్సైజ్ సీఐ బి.మురళీమోహన్



పుత్తూరు: పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 18 మద్యం షాపులకుగాను 230 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ బి.మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం సీఐ మీడియాతో మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణ పూర్తయినట్లు తెలిపారు. స్టేషన్ పరిధిలోని పుత్తూరు మండలంలోని 7 షాపులకు 78 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. నారాయణవనం 3 షాపులకు 51, వడమాలపేట 4 షాపులకు 68, రామచంద్రాపురం 4 షాపులకు 33 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల వంతున రూ.4.60 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్లు వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుపతిలోని శిల్పారామం అర్బన్ హట్‌లో లాటరీ పద్ధతిలో డ్రా తీస్తామని తెలిపారు. 16వ తేదీ నుంచి షాపులను నిర్వహించుకోవచ్చునని తెలిపారు.

వీధి కుక్కలకు స్టెరిలైజేషన్



పుత్తూరులో కుక్కల పట్టివేత

పుత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం కుక్కలను పట్టి, వాటికి స్టెరిలైజేషన్ చేసి, రేబిస్ టీకాలు వేసి యథాస్థానంలో వదలిపెట్టినట్లు మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏటా పెరిగిపోతున్న కుక్కల సంఖ్య, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా స్టెరిలైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తిరుపతి బ్లూ అనిమల్ కేర్ ద్వారా స్థానిక రామనాథంశెట్టి వీధి, కావమ్మగుడి వీధి, బెస్తవీధి, ధర్మరాజుల గుడి, రాజాజీ వీధిలో కుక్కలను పట్టి స్టెరిలైజేషన్ చేసినట్టు తెలిపారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మంజునాథగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శీను, శానిటరీ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

